# హరిజన విద్యార్థి

నేను హరిజన విద్యార్థిని; నాకొక్క సీటు దయ చేయండి, అన్నాడు ఒక ముక్కుపోగు అబ్బాయి. అనగానే,

'హరిజన విద్యార్థివైతే నాకేం?' అనాలనిపించింది, గాని ఆ తెలుగు వాక్యం అతనికి అర్థం కాదనిపించింది.

హరిజనుణ్ణి అనేమాట Pass word అయింది ఆ మాట అనగానే వెంటనే లేచి కావిలించుకోవాలి, ఆ మాట అన్న మనిషిని. తరవాత గంగాళంలో నీళ్ళతోడించి ఇద్దరమూ కలిసి పోసుకోవాలి. లేకపోతే క్రిష్టకు వెళ్ళాలి. తరవాత విస్తళ్ళు తాకుతూ భోజనం చెయ్యాలి. ఒకటే గ్లాసు లోంచి తాగాలి. కూతురు వుంటే వివాహమాడి మా కులగోత్రాలను ఫలితం చేస్తాదేమో కనుక్కోవాలి. ఉద్యోగాలు, స్కాలర్‌షిప్పులు, సీట్లు, ప్రమోషన్లు, అన్ని తలుపులూ "హరిజనుణ్ణి" అనేమాటతో విడిపోతాయి. అన్నీ ఆహ్వానాలే. హరిజనుణ్ణి అనడమూ, గొప్పగా హరిజనుడివా, రా, నాయనా, అని కావిలించు కోవడమూ.

నాకుమాత్రము కంటకంగా ఉంది. హరిజనుడు అనే పదము పుట్టకపూర్వము యిరవైఏళ్ళ క్రిందనించి చివరకు కూడా ఎవరినీ "నీకులం ఏమిటి?" అని అడగని నన్ను హరిజనద్వేషిక్రింద కట్టేవారుందరని నమ్మకం. ఈ హరిజనోద్ధారకులు అందరూ ఇదివరకు నాబోటి వారిని వెలివేసేవారే! ఈనాడు హరిజనులతో భోజనం చేస్తారు గనుక వెలిలేదు.

నేను పూర్వం మాలవాళ్ళతో భోజనం చేశాను. గనుక నాకు మాత్రం వెలి ఇంకా పోలేదు.

పోయిన సంవత్సరం ఒక కుర్రాడు చాలాకాలం బడి ఎగకొట్టాడు.

'ఎందుకు రాలేదు?' అన్నాను.

అతను కారణం చెప్పడం యిట్లా ప్రారంభించాడు.

'నేను హరిజన విద్యార్థి నండి—'

'హరిజన విద్యార్థివా? నాకు తెలీనే తెలీదే. ఇన్నాళ్ళూ ఆసంగతి తెలీక నిన్ను దగ్గరికి రానిచ్చానే? ఇంక దూరంగావుండు' అన్నాను.

'ఇంకా చాలామంది ఉన్నారండి'

'ఉంటేనేం? వాళ్ళను కులం అడగనూ అడగను, వాళ్ల చెప్పనూ చెప్పరు. నువ్వు చెప్పావుగా, తెలిసి ఇంక నిన్నెట్లా రానిస్తాను?' అన్నాను.

ఈ హరిజన విద్యార్థి ఏమంటాడంటే, తను హరిజనుడు గనుక తక్కిన వాళ్ళని తోసేసి తనకి సీటు ఇమ్మంటాడు. న్యాయమేమిటా అని ఆలోచించాను.

'హరిజనుడవైతే నేం?'

అని తరచి అడిగితే,

'బీదవాణ్ణి గనక' అని తేలుతుంది.

బీదబ్రాహ్మడే ఉన్నాడనుకోండి.

ఎవరికిగాని ఈ 'సీట్' ఎందుకు?

డబ్బుకి, డబ్బు సుఖానికి; పోనీ జ్ఞానానికి.

ఈ యిద్దరిలో ఎవరికి డబ్బుగాని, జ్ఞానంగాని, సుఖంగాని ఎక్కువ అవసరం?

'మీ తండ్రి ఏం చేసేవాడు' అడిగితే చాలామంది హరిజనులు 'కూలి' అనిగాని 'చెప్పులు కుట్టటం' అని గాని చెపుతారు.

నెలకి ఏ పదిరూపాయలో ఆదాయం ఉండవచ్చు.

బ్రాహ్మణ్ణి అడిగితే 'పౌరహితుడో, గుమాస్తో, భూస్వామో' అని అంటాడు.

సుఖానికి, జ్ఞానానికి అలవాటు పడ్డవాడు బ్రాహ్మడు-కష్టానికి బీదరికానికి అలవాటుపడ్డవాడు హరిజనుడు.

బీదవాళ్ళు—'అయ్యో ఎంత బీదవాడు' అంటారు.

కాని ఎప్పుడూ బీదవాడు, బీదరికం బాధనెరగడు. మంచి దినాలు చూచిన దరిద్రుడికి వుండేబాధ బీదవాడికేమీ వుండదు.

పుట్టినప్పటిణ్ణించి మురికిలో, ఆకలిలో, చిరిగిన గుడ్డలలో పెరిగి, ఎండకి, చలికి అలవాటుపడ్డ వాడి పేదరిక మోకకష్టమా? బాలుడుగా వుండేప్పుడు తండ్రి సంపాయించగా, శుచిఐన భోజనమూ, పరుపులూ, యిల్లూ, శాలువాలూ, అలవాటు పడ్డవాడు, బీదరికానికి ఓర్వడం కష్టం. ఆ హరిజనుడి తృప్తిగాని, ఆరోగ్యంగాని, ఓర్పుగాని యీ కులం గొప్పవాడికి వున్నాయా? ఈ సీటూ యీ వుద్యోగమూ లేకపోతే, తన గుడిశెలో కూనిరాగాలుతీస్తో, గంజితాగి బతికేశక్తి వుంది ఆ హరిజనుడికి. ఆ పది హేనురూపాయలు లేకపోతే ఆత్మ నమ్ముకుని బతకాలి యీ బ్రాహ్మడు. లేకపోతే ప్రాణత్యాగం చెయ్యాలి.

'నేను హరిజనుణ్ణి' అనడంలో రాజకీయ కారణాలు, సాంఘిక కారణాలు ఉంటే ఉండవచ్చు. కాని న్యాయం మాత్రం గొప్ప దశనించి పడిపోయిన ఆ జాతే బాధపడే జాతి- కనికరింపబడవలసిన జాతి. ఒక ధనంలోనే కాదు. రాజసౌఖ్యాలకి ఆలోచనలకి సాహసాలకి అలవాటుపడ్డ వాళ్ళ కన్నబిడ్డని బీదతనానికి — క్షుద్రజారత్వానికి, స్వల్ప స్వల్ప ఆలోచనలకి అలవాటైన యింట పెంచితే బాధతప్పదు. ఆ రక్తానికి తగిన పరిస్థితులుండాలి. పులిపిల్లని పసితనము నించి బోనులో పెంచితేమాత్రం దూకడానికి స్థలంకోసం బాధపడడం మానుతుందా?

తరాలనించి దారిద్రంలో వున్న వాళ్ళబాధ తలచుకొని పద్యాలూ, వ్యాసాలూ వ్రాస్తారు. పత్రికలనిండా అవే!

కాని సమస్త ఐశ్వర్యాలు అనుభవించిన జాతులపతనం—వారి బాధని గురించి ఎవరూ వ్రాయరే! రాజ్యాలేలిన వాళ్ళు అడుక్కొంటున్నారు.

జ్ఞానతేజస్సుతో వెలిగినవాళ్ళు విద్యకై యాచన చేస్తున్నారు— వీళ్ళబాధని ప్రకటించరేం?

హరిజనుడి గతి తలుచుకొని ఉపన్యాసాల్లో, పద్యాల్లో, కారే కన్నీళ్ళన్నీ ఈ క్రొత్తప్రచారం వచ్చిందాకా ఎక్కడ దాక్కున్నాయి?

మా పూర్వీకులు దరిద్రులు గనక నాకు 'సీటు' కావాలని ఒకడు అడగ్గాలేనిది, నా పూర్వీకులు ఈదేశాన్నంతా, ఆధ్యాత్మికజ్ఞానంతో నింపారు. ధనాన్ని తృణప్రాయంగా త్యజించారు. శరీరాన్ని తపింపచేసి చేసి, శుష్కించి, ప్రజా సేవచేశారు. నాకొక్క 'సీటు' యిమ్మనకూడదూ?

ప్రపంచం చూసినకొద్దీ, మనుషులందరూ ఒకటేనన్నమాట అబద్దం గా కనపడుతోంది. మృగాలన్నీ వొకటే. మనుష్యులూ మృగాలూ వొకటే, అని అంటే ఎంత వాస్తవంగా వుంటుందో ఇదీ అట్లానే వుంటుంది.

'అయ్యో దున్నపోతు వానలో తడుస్తోంది పడక గదిలో కట్టివెయ్యరా!'

'పంది బురదలో పొల్లుతోంది శుభ్రంగా స్నానం చేయించరా!'

'ఆ చిలక అట్టా ఎగురుతుందే? పడిపోతుంది పంజరంలో పెట్టరా' అన్నట్టవుతుంది మన తెలివి.

లోకమంతా నన్ను 'ఛీ ! మాలకూడు తిన్నాడు' అన్న కాలంలో యీ హరిజనోద్ధారక యోధులందరూ 'ఛీ, ఛీ తిన్నాడా ?' అన్నవారే! అప్పుడు మాలవాళ్ళమీదా, వాళ్ళని తాకినవాళ్ళమీద వుమ్మేసే రోజులవి.

ఇప్పుడు వాళ్ళనే పూలదండలువేసి గౌరవించే రోజులొచ్చాయి. ప్రపంచం మెచ్చుకుంటోందని తెలీగానే, పూరికే ఒకరినొకరు తోసుకుని, స్త్రీ పురుషులు పత్రికల్లోకి హరిజనోద్ధారకులకింద బొమ్మలూ పేర్లు ప్రకటించుకున్నారు.

పదేళ్ళకింద వారందరూ బతికేవున్నారు. అప్పుడూ యింకో రూపంలో యింకోపేరుతో యీ వుద్యమం వుండనే వుంది. ఏమైనారు వీళ్ళందరు ?

ఇతరుల దారిద్రంలో కష్టాలలో సానుభూతిచూపే హృదయం.... ఎప్పుడూ చూపుతుంది. ఆ సానుభూతి fashion అయ్యేవరకు ఆగదు.

"హరిజన నిధికి చందాకి వచ్చింది ఒకామె నాదగ్గరికి."

"మీరు అతనికన్న హీనస్థితిలో వున్నారు. ముందు మిమ్మల్ని మీరు వుద్ధరించుకోండి." అన్నాను.

"మీరు" అంటే ఎవరండోయ్ ?

"అంటే స్త్రీలు"

"మాకేం?"

"మీరందరూ అంటరానివారే !"

"ఏం ?"

"బహిరంగంగా మొగవారు తాకకూడదుగా !

ఒక్క గాజులవాళ్ళూ మంగలవాళ్ళుతప్ప.

అంతేకాదు. మీలో చూడరానివాళ్ళు ఉన్నారు. హరిజనులకన్న అధమస్థితి మీది."

"చూడరాని వాళ్ళెవరు ?"

"గోషావాళ్ళు"

"కాని అంత బీదవాళ్ళం కాదుగా !"

"నాకేం ? అందరూ యాచకులే, మొగుళ్ళ దగ్గర."

"ఆస్తివున్న స్త్రీ లెందరు? ఎందరు బైటపడి కానీ సంపాదించ గలరు ?"

"మీ బట్ట మీదికాదు. మీ తిండి మీదికాదు" అన్నాను.

ఆమె వెళ్ళింది కోపంతో.

ఇంకా స్త్రీల వుద్యమంలో పనిచెయ్యడం కొంతవరకే fashion అయింది- మీటింగులూ కాన్ఫరెన్సులూ—కనక అంతవరకే పనిచేస్తారు వివేకవంతులందరూ. పూలదండలూ- అచ్చులో పేర్లూ—అదృష్టముంటే బొమ్మలూ !

★

# హత్యా విచారణ

మూడివిజన్ పోలీసువాళ్ళందరమూ కిందనించి పైదాకా నల్లి మందు నిద్రపోతున్న ట్లున్నామని సూపరెంటునించి గూటింపులు తీవ్రంగా వొచ్చినరోజే "టోలుగేటు" పక్కన కొత్తమొండెమూ, గాడిబావిదగ్గిర తలా దొరికాయి. యింక యీకేసన్నా శ్రద్ధవహించి ఆచోకి తియ్యకపోతే, "సస్పెన్షన్" దాకా వొస్తుందని మూడురోజులు నిద్రాహారాలు లేకుండా